చేనేత పరిశ్రమను పరిరక్షించాలని వినతి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతి పత్రం ఇస్తున్న చేనేత నాయకులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 27 : పోచంపల్లి ఇక్కత్ ప్రింటెడ్ చీరెలను అరికట్టి చేనేత పరిశ్రమను పరిరక్షించాలని కోరుతూ పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు బుధవారం వినతి పత్రం అందజేశారు. పట్టులో సాదా చీరెలు తయారు చేయించి ప్రింటెడ్ చేస్తున్నారని, దాంతో నేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. పోచంపల్లి ఇక్కత్ డూప్లికేట్ వస్త్రాలను అరికట్టాలని, కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. చేనేత పరిశ్రమ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు ఏలె భిక్షపతి, బోగ నరసింహ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రాజాపేట : రేణికుంటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రాజాపేట, నవంబర్ 27 : ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని భువనగిరి అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండలంలోని రేణికుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం పూర్తి స్థాయిలో సేకరించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో త్వరగా డబ్బులు జమ అయ్యేలా చూడాని ఆదేశించారు. ఆయన వెంట తాసీల్దార్ దామోదర్, ఆర్ఐ రమేశ్, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్ రాంరెడ్డి ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 27 : మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది విద్యార్థులకు వంట చేస్తున్నారని ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పరిశుభ్ర వాతావరణంలో భోజనం చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీని పరిశీలించారు. తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ గుత్తా వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దూదివెంకటాపురం పాఠశాలలో వంట నూనె పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్

రాజాపేట, నవంబర్ 27 : మండలంలోని దూదివెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, టీచర్ల హాజరు శాతం రికార్డులను పరిశీలించారు. పాఠశాల పరిశుభ్రత, పచ్చదనం, పాఠశాలలో గ్రంథాలయం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యకం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజన నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట గదితోపాటు, వంట పాత్రలు, సరుకులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్. విజయలక్ష్మి, ఎంపీఓ కిషన్ ఉన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలి

బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న పట్టణ సీఐ సురేశ్‌కుమార్

భువనగిరి అర్బన్, నవంబర్ 27 : బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని పట్టణ సీఐ సురేశ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బాల్య వివాహ్ ముక్త్ భారత్, బాల్య వివాహ రహిత భారత్ ప్రచారాన్ని న్యూఢిల్లీలో ప్రారంభిస్తున్న నేపథ్యంలో బుధవారం పట్టణంలో ఎన్జీఓలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రైవేటు పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరుగకుండా స్వచ్ఛంద సంస్థలు పని చేయాలన్నారు. బాల్య వివాహాలు జరిపించే తల్లిదండ్రులకు అవాగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయశ్రీ, పట్టణ ఎస్ఐ అరుణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతో విద్యార్థులకు అవగాహన

భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తుపాకులను వినియోగించే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న రూరల్ సీఐ సంతోష్‌కుమార్

భువనగిరి అర్బన్, నవంబర్ 27 : విద్యార్థులు క్షేత్ర పర్యటన చేయడంతో విజ్ఞానంతోపాటు అవగాహన పెరుగుతుందని భువనగిరి రూరల్ సీఐ సంతోష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జీనియస్ పాఠశాల విద్యార్థులకు క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం ఫైర్ స్టేషన్, భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసులు వినియోగించే తుపాకులపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సమాజంలో జరుగుతున్న పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. పట్టుదలతో చదివి ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వచ్చే నెల 1న రాఘవాభారతి గ్రంథాలయ వార్షికోత్సవం

వార్షికోత్సవ ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న ఎంఈఓ మహదేవరెడ్డి, నిర్వాహకులు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 27 : మండలంలోని రాఘవాపురంలో డిసెంబర్ 1న నిర్వహించే రాఘవాభారతి గ్రంథాలయం 3వ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు వంగాల రమేశ్ అన్నారు. వార్షికోత్సవం ఆహ్వాన పత్రికలను మండల కేంద్రంలో ఏంఈఓ కొత్త మహదేవరెడ్డి బుధవారం విడుదల చేశారు. వేడుకలకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ప్రజా గాయని విమలక్క, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్ హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కాటం నరేశ్, కొంపల్లి వెంకటేశ్, గోపయ్యచారి, సిద్ధిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన నారసింహ హోమం

యాదగిరిగుట్ట, నవంబర్ 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు హస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. సువర్ణమూర్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణపుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి, స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి వెండి మొక్కు జోడు సేవను ఊరేగించారు. స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాదన, శయనోత్సవ సేవను అత్యంత వైభవంగా జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. కార్తిక మాసం సందర్భంగా తెల్లవారుజామునే మహిళలు దీపారాధనలో పాల్గొన్నారు. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొని వ్రత మాచరించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.30,79,965 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

వసతి గృహాల్లో మండల అధికారుల రాత్రి బస

గుండాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తాసీల్దార్ జల కుమారి

గుండాల, నవంబర్ 27 : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం, మోడల్ స్కూల్, సీతారాంపురంలోని ఎస్సీ బాలుర హాస్టళ్లలో బుధవారం రాత్రి తాసీల్దార్ జలకుమారి, ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోత్స్న, ఎంఈఓ అగ్గిరాములు రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి అక్కడే నిద్రించారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల ఇబ్బందులను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సీడీపీఓ జ్యోత్స్న మాట్లాడుతూ మోడల్ స్కూల్ వసతి గృహంలో కిటికీలు సరిగ్గా లేవని, వసతి గృహం చుట్టూ నీళ్లు చేరి జమ్మి పొదలు మొలిచాయని, కూర్చునేందుకు సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు నిలబడి భోజనం చేస్తున్నారని తెలిపారు. వారి వెంట ఎస్ఓ విజయలక్ష్మి, వసతి గృహాల అధికారులు ఉన్నారు.

బీసీ బాలుర హాస్టల్లో రాత్రి బసపై అలసత్వం

గుండాల మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో బుధవారం రాత్రి మండల ప్రత్యేక అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి రాత్రి బస చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ పట్టనట్లుగా వ్యవహరించారు. విద్యార్థులు భోజనం చేసే సమయానికి ఆయన రాకుండా అలసత్వం వహించారు. సదరు అధికారి రాక కోసం విద్యార్థులు భోజనం చేయకుండా గంటకు పైగా ఎదురుచూశారు. విద్యార్థులు భోజనం చేసి నిద్రించిన తర్వాత మండల ప్రత్యేకాధికారి వచ్చి హడావుడి చేశారు. విద్యార్థులతో మాట్లాడుతున్నట్లు, వసతి గృహాన్ని తనిఖీ చేసినట్లు ఫొటోలు దిగారు.

బాలరాజు యాదవ్ పరామర్శ

రామన్నపేట, నవంబర్ 27 : అఖిల భారత యాదవ మహాసభ విద్యావంతుల వేదిక మండలాధ్యక్షుడు గోగు వెంకటేశ్వర్లు మాతృమూర్తి ఎల్లమ్మ బుధవారం మృతి చెందారు. ఫిష్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూదిమెట్ల బాలరాజుయాదవ్ ఎల్లమ్మ అంతక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు ముక్కాముల దుర్గయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన అయోధ్య యాదవ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశ్, బలరాం, లింగస్వామి, వినయ్, నరేశ్ ఉన్నారు.

ఐఐఎస్ఎఫ్‌కు ఆలేరు ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఎంపిక

ఆలేరు టౌన్, నవంబర్ 27 : ఆలేరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి సైదులు అసోం రాష్ట్రంలోని గుహాటి ఐఐటీలో జరిగే ఇండియాన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు. భారత విజ్ఞాన శాస్త్ర, సాంకేతికత మంత్రిత్వ శాఖ మరియు భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ, విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశంలోని శాస్త్రవేత్తలు, విజ్ఞాన ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు హాజరవుతారని సైదులు తెలిపారు. సైదులు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 27 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మండల స్థాయిలో పునరుద్ధరణ ఇంధన వనరులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి : సీపీఎం

ఆలేరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆలేరు టౌన్, నవంబర్ 27 : ఆలేరులో అర్హులైన పేదలకు ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్ అన్నారు. ఆలేరు పట్టణంలోని సుభాశ్‌నగర్, మహాలక్ష్మి రైస్ మిల్, పలు కాలనీల్లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించడమే లక్ష్యంగా సీపీఎం పని చేస్తుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీపీఎం నాయకులు మల్లేశం, అజయ్, విప్లవ్, గణేశ్, నరేశ్, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసమే హాస్టల్ నిద్ర : తాసీల్దార్

వలిగొండ : లోతుకుంట హాస్టల్‌లో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

వలిగొండ, నవంబర్ 27 : విద్యార్థుల సమస్యలను దగ్గరి నుంచి పరిశీలించి పరిష్కరించేందుకే హాస్టల్ నిద్ర చేస్తున్నట్లు తాసీల్దార్ పి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో బుధవారం రాత్రి హాస్టల్ నిద్ర కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంట గదులు, పరిశుభ్రత, ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కోతుల బెడద తీవ్రంగా ఉందని, భోజనాలు చేసే సమయంలో గ్రిల్స్ లేక తమపై దాడులు చేస్తున్నాయని, భయపెట్టి అన్నం తినకుండా చేస్తున్నాయని తెలిపారు. హాస్టల్ బయట లైట్లు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. భోజనశాలకు గ్రిల్స్, హాస్టల్ బయట విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయించాలని తాసీల్దార్‌ను కోరారు. విద్యార్థినుల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తాసీల్దార్ తెలిపారు.

విద్యాభివృద్ధికి దివీస్ లేబొరేటరీస్ సేవలు అభినందనీయం

● మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్

వలిగొండలో దివీస్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ ల్యాబ్ మెటీరియల్ ప్రొసీడింగ్‌ను మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్‌కు అందజేస్తున్న దివీస్ కంపెనీ ప్రతినిధులు

వలిగొండ, నవంబర్ 27 : విద్యార్థుల విద్యాభివృద్ధికి దివీస్ లేబొరేటరీస్ కంపెనీ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈఓ సుంకోజు భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో దివీస్ లేబొరేటరీస్ కంపెనీ బుధవారం 24,87,000 రూపాయల విలువైన సైన్స్ ల్యాబ్ పరికరాలను ఆయా స్కూళ్లకు అందజేసింది. వాటిని మండలంలోని 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని వేలాది మంది విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడే సైన్స్‌ల్యాబ్ పరికరాలను అందజేసి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న దివీస్ కంపెనీ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, దివీస్ కంపెనీ ప్రతినిధులు సాయికృష్ణ, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి

మోత్కూరు, నవంబర్ 27 : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చెకుముకి జిల్లా స్థాయి ప్రతిభా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సృజనాత్మక వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూరోజు భాస్కరాచారి, సుబ్రమణ్యం శర్మ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

మైనార్టీ విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

భువనగిరి అర్బన్, నవంబర్ 27 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకునే 8, 9, 10వ తరగతి విద్యార్థినులకు రోటరీ క్లబ్ భువనగిరి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ భువనగిరి శాఖ అధ్యక్షుడు హనీఫ్ మెమన్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే నిరుపేద విద్యార్థులకు పలు రకాలుగా సహాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇంతియాజ్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎంపల్ల బుచ్చిరెడ్డి, గుమ్మల మల్లేశ్, క్లబ్ డైరెక్టర్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వేల్ గురుకులాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● పాఠశాల భవనాల ప్రారంభంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 27 : దేశంలోనే మొట్టమొదటి సర్వేల్ గురుకుల విద్యాలయాన్ని అన్ని వసతులు కల్పించి, విద్యా ప్రమాణాలు పెంచి దేశంలోనే ఆదర్శ గురుకుల పాఠశాలగా తీర్చిదిద్దుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. రూ.20 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటేడ్ స్కూల్ సరిపోదని, మండలానికి ఐదు చొప్పున 30 స్కూళ్లు నిర్మించాలని అన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రస్తుతం ఉన్న డార్మెటరీ సరిపోవడం లేదని, నిధులు కేటాయించి నూతన భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తానని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని సర్వేల్ గురుకుల పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గురుకుల సొసైటీ సెక్రటరీ రమణకుమార్, డీఈఓ సత్యానారాయణ, మండల ప్రత్యేకాధికారి జైపాల్‌రెడ్డి, తాసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ నర్సింహారావు, ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశం పాల్గొన్నారు.

వంగపల్లి పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వంగపల్లి పాఠశాలలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్ 27 : మండలంలోని వంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆంగ్ల భాషలో మాట్లాడాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని, మంచి జీపీఏ సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులను అడిగి సమస్యల గురించి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎన్.కృష్ణారెడ్డి పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీనిచ్చారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మెతుకు సైదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులను అరెస్టు చేయాలి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 27 : మండలంలోని పిలాయిపల్లి గ్రామానికి చెందిన కుతాటి ప్రేమలత, యాదగిరి పూరిగుడిసెను కూల్చివేసిన భూ కబ్జాదారులను అరెస్టు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయంతోపాటు ఉపాధి అవకాశం కల్పించాలని, బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుతాడి రవికుమార్, ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ సదానందం, జిల్లా అధ్యక్షుడు సురేశ్, నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

రేపు మదార్ సాహెబ్ ఉర్సు

● ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

జిందాషా మదార్ సాహెబ్ ఉర్సుకు ముస్తాబైన దర్గా

ఆలేరు టౌన్, నవంబర్ 27 : ఆలేరు బైపాస్ సమీపంలోని జిందాషా మదార్ సాహెబ్ ఉర్సు శుక్రవారం జరుగనుండగా.. దుర్గాను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా దర్గా సంరక్షకులు బీజని మధుకుమార్ మాట్లాడుతూ ఈ నెల 29న మధ్యాహ్నం 1:30 గంటలకు ఆలేరులోని కాటమయ్యనగర్‌లో మదార్ ఇంటి దగ్గర నుంచి జిందాషా మదార్ బాబా దర్గా వద్దకు ఫకీర్లు మరియు మర్ఫా బృందంతో గంధం ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 4:30కు దంబాల్ కార్యక్రమం, సాయంత్రం 6గంటలకు ఖవ్వాలి ఉంటుందని మధుకుమార్ తెలిపారు. 30న సాయంత్రం 6గంటలకు దర్గా వద్ద భక్తులు దీపారాధన (చిరాకా) నిర్వహిస్తారని చెప్పారు. డిసెంబర్ 1న ఆదివారం అమావాస్య రోజు మధ్యాహ్నం 2గంటలకు దర్గా వద్ద మదార్‌బాబా జికర్ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మదార్